ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 5 జనవరి 2025












# పెద్దకందుకూరు ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్‌లో భారీ పేలుడు

**కార్మికుడు మృతి, మరో ముగ్గురికి గాయాలు**

**లంచ్ టైం కావడంతో తప్పిన పెను ప్రమాదం**

**ముందస్తు జాగ్రత్తగా 50 మందికి కార్మికులకు పరీక్షలు**

**భారీ పేలుడు శబ్దంతో ఉలిక్కిపడ్డ పెద్దకందుకూరు, పరిసర గ్రామస్తులు**






యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు శివారులో ఉన్న ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో శనివారం భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో కనకయ్య అనే కార్మీకుడు చనిపోగా.. మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలోని పీఆర్డీసీ బిల్డింగ్-3లో వేమెంట్ సెక్షన్ లో ఉదయం 9:45 గంటల సమయంలో.. ఎంవీటీ (మెగ్నీషియం, వైటాన్, టెఫ్లాన్) మిశ్రమాన్ని వేయింగ్ చేస్తున్న క్రమంలో.. ప్రమాదవశాత్తు పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో అదే బిల్డింగ్ లో పని చేస్తున్న నలుగురిలో.. జనగాం జిల్లా బచ్చన్నపేటకు చెందిన మార్క కనకయ్య(54) అనే కార్మికుడికి తీవ్ర గాయాలు కావడంతో.. హాస్పిటల్ కు తరలిస్తుండగా మార్యమధ్యలోనే చనిపోయాడు. మరో ముగ్గురు కార్మికులకు గాయాలు అయ్యాయి. గాయపడ్డ యాదగిరిగుట్ట మండలం రామాజీపేటకు చెందిన మొగిలిపాక ప్రకాశ్ ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ లోని యశోదా హాస్పిటల్ కు తరలించగా.. వంగపల్లికి చెందిన మరో ఇద్దరు క్షతగాత్రులు నర్సింహులు, వేణుగోపాల్ ను భువనగిరిలోని కస్తూరి హాస్పిటల్ కు తరలించి ట్రీట్‌మెంట్ అందిస్తున్నారు. కంపెనీలో ఉదయం 9:45 గంటల ప్రాంతంలో పీఆర్డీసీ బిల్డింగ్-3లో ప్రమాదవశాత్తు సంభవించిన పేలుడులో గ్యాస్ ఎనర్జీ కారణంగానే భారీ శబ్దం ఉత్పన్నమైందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. బిల్డింగ్ లో మొత్తం 16 మంది డ్యూటీలో ఉండగా.. లంచ్ సమయం కావడంతో కార్మికులంతా బయటకు రాగా.. నలుగురు మాత్రమే బిల్డింగ్ లో ఉన్నారని తెలిపారు. గ్యాస్ ఎనర్జీ కావడంతో బ్లాస్ట్ సమయంలో భారీ సౌండ్ వచ్చిందన్నారు. బర్నింగ్ మెటీరియల్ ఉండొచ్చనే అనుమానంతో ప్రమాద స్థలికి ఎవరినీ అనుమతించడం లేదన్నారు. బిల్డింగ్ లోని వేమెంట్ సెక్షన్ లో పేలుడులో సంభవించి మిగతా సెక్షన్లకు మంటలు వ్యాపించడంతో.. మరో రెండుసార్లు బ్లాస్ట్ జరిగి ఉండవచ్చని ప్రాథమిక నిర్ధారణకు వచ్చామని తెలిపారు.

**శబ్ధతీవ్రతకు గురైన 50 మందికి మెడికల్ టెస్టులు**

పేలుడు వల్ల ఏర్పడిన భారీ శబ్ధం కారణంగా కొందరు కార్మికుల్లో వినికిడి, తలనొప్పికి సంబంధించిన సమస్యలు ఉత్పన్నమయ్యాయి. దీంతో కంపెనీ యాజమాన్యం ముందస్తు జాగ్రత్తగా వారికి వైద్య పరీక్షలు చేపించారు. భువనగిరిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో దాదాపుగా 50 మంది కార్మికులు వినికిడి, తలనొప్పికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ట్యాబ్లెట్లు అందజేసినట్లు డాక్టర్లు తెలిపారు. ఇక భారీ పేలుడు కారణంగా ఉత్పన్నమైన శబ్ధం దాదాపుగా ఏడు కిలోమీటర్ల వరకు వినిపించిందని పలు గ్రామాల ప్రజలు తెలిపారు. ముఖ్యంగా కంపెనీ ఉన్న పెద్దకందుకూరు గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. పేలుడు తీవ్రతకు గ్రామం కొద్దిపాటి వైబ్రేషన్స్ వచ్చాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇక కంపెనీలో పనిచేసే కార్మికులు అధిక శాతం పెద్దకందుకూరు గ్రామస్తులే కావడంతో.. తమవారికి ఏమైనా జరిగిందోననే భయంతో కుటుంబ సభ్యులు కంపెనీ వద్దకు హుటాహుటిన పరుగులు తీశారు. కంపెనీ ఎదుట నిరీక్షిస్తూ కంపెనీలో పనిచేస్తున్న తమవారి కోసం ఎదురుచూస్తూ ఆందోళనతో కన్నీటిపర్యంతం అయ్యారు. కార్మికుల కుటుంబ సభ్యుల రోదనలతో కంపెనీ ఎదుట కాసేపు ఉద్విగ్న పరిస్థితులు ఏర్పడ్డాయి.

**లంచ్ టైం కావడంతో తప్పిన పెను ప్రమాదం**

ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో సంభవించిన పేలుడులో పెను ప్రమాదం తప్పింది. పేలుడు జరిగిన పీఆర్డీసీ బిల్డింగ్-3లో మొత్తం 16 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఫస్ట్ షిఫ్ట్ లో(ఉదయం 6 గంటలకు) వచ్చిన కార్మికులకు ఉదయం 10 గంటలకు లంచ్ టైం ఉంటుంది. దీంతో లంచ్ టైం సమీపిస్తుండడంతో.. ఉదయం 9:30 గంటలకు బిల్డింగ్ లో డ్యూటీలో ఉన్న 16 మందిలో 12 మంది లంచ్ చేయడం కోసం బయటకు రాగా.. మిగతా నలుగురు బిల్డింగ్ లోనే ఉండిపోయారు. అదే సమయంలో(ఉదయం 9:45 గంటలు) బిల్డింగ్ లో భారీ పేలుడు సంభవించింది. దీంతో ఒక కార్మికుడు చనిపోగా, మిగతా ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లంచ్ టైం కాకుంటే 16 మంది కార్మికులంతా పేలుడు సంభవించిన బిల్డింగ్ లోనే ఉండేవారని, తద్వారా భారీగా ప్రాణనష్టం జరిగేదని కార్మికులు భయాందోళన వ్యక్తం చేశారు. లంచ్ కారణంగా ఎక్కువమంది కార్మికులు బయటకు వెళ్లడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది.

**ప్రమాదస్థలిని పరిశీలించిన విప్ అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే సునీత**

ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో పేలుడు ప్రమాద ఘటన విషయాన్ని తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత.. పేలుడు జరిగిన ప్రదేశాన్ని వేర్వేరుగా పరిశీలించారు. ప్రమాదంలో కార్మికుడు కనకయ్య చనిపోవడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చనిపోయిన కార్మికుడి కుటుంబానికి, గాయపడ్డ మిగతా ముగ్గురు కార్మికులకు కంపెనీ యాజమాన్యం అండగా నిలవాలని సూచించారు.

## ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీపై చర్యలు తీసుకుంటాం

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

పేలుడు ఘటనలో ఓ కార్మికుడి మృతికి కారణమైన ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన ప్లేస్ ను ఆయన పరిశీలించి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టాలని ఎన్నిసార్లు చెప్పినా కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనార్జనే ధ్యేయంగా కంపెనీ యాజమాన్యం వ్యవహరిస్తుందే తప్ప కార్మికుల రక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. కార్మికుల చెమటతో లాభాలు ఆర్జిస్తున్న కంపెనీ యాజమాన్యం.. కార్మికుల రక్షణకు చర్యలు చేపట్టకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన బిల్డింగ్ ను పరిశీలిస్తే ఎలాంటి సేఫ్టీ ప్రికార్షన్ తీసుకోలేదని స్పష్టమవుతోందన్నారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరిపి కంపెనీ యాజమాన్యంపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## మృతుడు కనకయ్య కుటుంబానికి రూ.60 లక్షల ఎక్స్ గ్రేషియా

**మృతుడి భార్యకు కంపెనీలో ఉద్యోగం**

**ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీ ఆపరేషన్స్ డైరెక్టర్ దుర్గాప్రసాద్**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో జరిగిన పేలుడు ప్రమాదంలో చనిపోయిన మార్క కనకయ్య కుటుంబానికి కంపెనీ యాజమాన్యం ఎక్స్ గ్రేషియా ప్రకటించినట్లు కంపెనీ ఆపరేషన్స్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ వెల్లడించారు. మృతుడి కుటుంబానికి చట్టపరంగా వచ్చే బెనిఫిట్స్ కాకుండా.. కంపెనీ తరఫున అదనంగా రూ. 60 లక్షల నష్టపరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. ఎక్స్ గ్రేషియాతో పాటు మృతుడి భార్యకు కంపెనీలో ఉద్యోగం కల్పిస్తున్నట్లు తెలిపారు. శనివారం కంపెనీలోని అన్ని కార్మిక సంఘాలతో జరిగిన సమావేశంలో కంపెనీ యాజమాన్యం ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో మృతుడి కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉండామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పేలుడు ఘటనలో గాయపడి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న.. మిగతా ముగ్గురు కార్మికుల ట్రీట్‌మెంట్ కు అయ్యే ఖర్చు మొత్తం కంపెనీనే భరిస్తుందని చెప్పారు. కంపెనీకి కష్టనష్టాల్లో అండగా నిలుస్తున్న కార్మికుల శ్రేయస్సే తమకు ముఖ్యమన్న ఆయన.. కార్మికులతో పాటు కార్మికుల కుటుంబాలకు సైతం అన్నివేళలా తోడుగా ఉంటామన్నారు.

## సీఎం రేవంత్ గారు... గుట్ట గుడి మహాకుంభాభిషేకానికి రండి!!

**ఫిబ్రవరి 19 నుండి 23 వరకు స్వర్ణ విమాన గోపుర మహాకుంభాభిషేకం**

**వేగిరంగా గోపురానికి స్వర్ణ తాపడం పనులు**

**సీఎంకి ఆహ్వాన పత్రికను అందజేసిన ఆలయ ఈవో, అర్చకులు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఫిబ్రవరి 19 నుండి 23 వరకు జరిగే స్వర్ణ విమాన గోపుర మహాకుంభాభిషేకానికి రావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డికి ఆలయ ఈవో. భాస్కర్ రావు ఆధ్వర్యంలో సీఎం ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. శనివారం సెక్రటేరియట్ లోని సీఎం ఛాంబర్ లో ఎండోమెంట్ మినిస్టర్ కొండా సురేఖతో కలిసి ఆలయ ఈవో భాస్కర్ రావు, ఆలయ ప్రధాన అర్చకులు నల్లంతీగల్ లక్ష్మీ నరసింహచార్యులు, కాండూరు వెంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు బట్టర్ సురేంద్ర చార్యులు శివాలయం ప్రధాన పురహితులు గౌరీభట్ల సత్యనారాయణ శర్మ, వేద పండితులు కొత్తూరు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలోని అర్చకులు సీఎం రేవంత్ ను కలిశారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో గర్భగుడిపై ఉన్న దివ్యవిమాన గోపురానికి బంగారు తొడుగులు అమర్చే పనులు శరవేగంగా జరుగుతున్నాయని సీఎం రేవంత్ కు ఈవో భాస్కర్ రావు వివరించారు. ఫిబ్రవరి 15 లోపు స్వర్ణతాపడ బిగింపు పనులు కంప్లీట్ అవుతాయని చెప్పారు. ఫిబ్రవరి 19 నుండి 23 వరకు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలతో మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామివారి లడ్డూప్రసాదం అందజేశారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**విద్యార్థులకు భువనగిరి ఎం.వీ.ఐ ఆనంద్ పిలుపు**




భువనగిరి, జనవరి 4 (రోమింగ్ న్యూస్): విద్యార్థులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని భువనగిరి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎస్. ఆనంద్ శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. భువనగిరి పట్టణంలోని దివ్య బాల పాఠశాలలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిద్దాం... రోడ్డు ప్రమాదాలను నివారిద్దామని ఆయన చెప్పారు.

మైనర్లకు బైకులు ఇవ్వడం వల్ల ప్రమాదాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు. అందువల్ల డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు వాహనాన్ని నడపడం నేరమని వివరించారు. విద్యార్థుల్లో ఈ విషయంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. స్కూటీలు, బైకులు విరివిగా వాడడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. కారు నడుపుతున్నట్లైతే సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. రోడ్డు దాటడానికి సురక్షితమైన ప్రదేశాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. అంతేకాకుండా సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని చెప్పారు. అదేవిధంగా అతివేగం ప్రమాదకరమని ఆయన హితవు చెప్పారు. నిర్లక్ష్యంగా ఓవర్టేక్ చేయడం వల్ల విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన భూ సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, భువనగిరి ఆర్టీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కుంచం వెంకమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే



నకిరేకల్ : మండలంలోని నోముల గ్రామ మాజీ సర్పంచ్ కొంచెం రమణమ్మ సోమయ్య మాతృమూర్తి కుంచం వెంకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం దశదినకర్మ సందర్భంగా స్థానిక సువర్ణ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఆమె చిత్రపటానికి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ రజిత శ్రీనివాస్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, ఆయా పార్టీల నాయకులు కుటుంబ సభ్యులు ఉన్నారు.

## కెసిఆర్ ని కలిసిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు వారు తెలిపారు.

**హరీష్ రావు ను కలిసిన బండ.. చిరుమర్తి**

నకిరేకల్ మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావుని కలిసి నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు లినల్గొండ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య లు తెలిపారు





ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 5 జనవరి 2025



# ఫుట్ పాత్‌లపై రాజకీయ పడగనీడ

## హైదరాబాద్‌లో పాదచారుల దారులు ప్రమాదంలో

- పర్యావరణానికి తీవ్రనష్టం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ & డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య.



హైదరాబాద్ 04 -జనవరి : హైదరాబాద్ మహానగరంలో పాదచారులకు చెందిన ఫుట్ పాత్‌లు దశాబ్దాలుగా ఆక్రమణలకు గురవుతూనే ఉన్నాయి. నగరంలోని 150 మున్సిపల్ డివిజన్లలో, ముఖ్యంగా వాణిజ్య ప్రదేశాల్లో, ఈ సమస్య తీవ్రమైంది. పాదచారుల కోసం నిర్మించిన ఫుట్ పాత్‌లు ఇప్పుడు రాజకీయ నాయకుల అధీనంలోకి వెళ్లాయి. అధిక శాతం మధ్యస్థాయి, చిన్నస్థాయి నాయకులు ఫుట్ పాత్‌లపై తమ కండువాలు వేసి, తెరవెనుక వ్యాపారాలు నిర్వహిస్తున్నారని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ & డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

### రాజకీయ ప్రభావంతో అధికారుల ఉదాసీన. ....

ఫుట్ పాత్ ఆక్రమణల వెనుక ఉన్న రాజకీయ సంబంధాల వల్ల, ప్రభుత్వ అధికారులు చూస్తూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వీటి వెనుక ఉండే వ్యాపార లావాదేవీలు సంవత్సరానికి వందల కోట్ల రూపాయల వరకూ ఉ ంటాయని చెబుతారు. అయితే ఈ లావాదేవీలలో ప్రభుత్వం లేదా జీహెచ్ఎంసీకి ఎలాంటి ఆదాయం రావడం ఉండదు. ప్రతి డివిజన్ లో వందల సంఖ్యలో ఇలాంటి అద్దె ఫుటపాత్ వ్యాపారాలు సర్వసాధారణం కళ్ళముందున్న నిజం.

### బిబిపర్యావరణ దుష్ప్రభావాలు - కాలుష్యం, ట్రాఫిక్

ఫుట్ పాత్‌ల ఆక్రమణ వల్ల పాదచారులు ప్రధాన రహదారులపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనివల్ల రోడ్లపై ట్రాఫిక్ జామ్‌లు పెరుగుతున్నాయి, వాహనాల కదలిక మందగిస్తుంది, కాలుష్యం మరింత అధికమవుతోంది. దీనికితోడు పాదచారుల భద్రత కూడా ప్రమాదంలో పడుతోంది.

### ప్రభుత్వానికి 'ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ కౌన్సిల్' విజ్ఞప్తి

ఈ సమస్యకు తక్షణ పరిష్కారంగా, ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షులు శ్రీ రంగయ్య,జాతీయ సలహాదారులు కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి లు

ఫుట్ పాత్ ఆక్రమణలను ఆపేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. పాదచారుల హక్కులను రక్షించడమే కాకుండా, ఈ వ్యాపారాల ద్వారా జరుగుతున్న నల్లధనం లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపేలా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.





### పాదచారుల హక్కుల పరిరక్షణకు చర్యలు

ఫుట్ పాత్‌లను ఆక్రమణల నుండి విముక్తి చేస్తూ, పాదచారులకు అందుబాటులోకి తేవాలి. ఫుట్ పాత్ ఆక్రమణలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. పాదచారుల ఉపయోగం కోసం శాస్త్రీయంగా, పర్యావరణహితంగా ఫుట్ పాత్‌లను పునరుద్ధరించాలి. ఫుట్ పాత్ ఆక్రమణలను నిరోధించేందుకు ప్రత్యేక నిఘా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ వంటి మెట్రోపాలిటన్ నగరంలో పాదచారుల హక్కులను రక్షించడం అత్యంత కీలకం. దీనికి ప్రభుత్వమూ, జీహెచ్ఎంసీ అధికారులు, పౌరసమాజం సంయుక్తంగా పని చేయాల్సిన అవసరం ఉంది. ఈ సమస్యను పరిష్కరించడం ద్వారా నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, కాలుష్యాన్ని నియంత్రించడం, పౌరులకు మెరుగైన జీవన నాణ్యత అందించడం సాధ్యం అవుతుంది. అధికారులు తక్షణమే దీనిపై దృష్టి సారించాలని రంగయ్య కోరారు.

# గృహజ్యోతి అమలులో విద్యుత్ ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయం

**ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం**










యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృజ్యోతి పథకాన్ని గ్రౌండ్ లెవల్ సక్రమంగా ఇంప్లిమెంట్ చేయడంలో విద్యుత్ ఉ ద్యోగుల పోషించిన పాత్ర ప్రశంసనీయమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కొనియాడారు. యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్ లో జరిగిన 'తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్' కు సంబంధించిన 'పవర్ మెన్' నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారితో కలిసి ఆయన మాట్లాడారు. గృహజ్యోతి పథకాన్ని లబ్ధిదారులకు సరైన విధంగా అమలు చేసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారని అభినందించారు. ప్రభుత్వాలను గద్దె దించాలన్నా, గద్దెనెక్కించాలన్నా విద్యుత్ అధికారుల వల్లే సాధ్యమవుతుందని చమత్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా ఆర్టిజెన్లు ఎదుర్కొంటున్న 16 రకాల సమస్యల గురించి సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### ప్రజాప్రభుత్వ తీరు చూసి ప్రతిపక్షాలు ఓర్వస్తలేవు

**- రాజ్యసభ సభ్యుడు మల్లు రవి**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని అంశాలను సైతం నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వ తీరును చూసి ప్రతిపక్షాలు ఓర్వస్తలేవని రాజ్యసభ సభ్యుడు మల్లు రవి మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఆరు గ్యారంటీలలో ఐదు గ్యారంటీలను అమలు చేశామన్నారు. అంతేకాకుండా హైడ్రా ఏర్పాటు చేసి అన్యాక్రాంతమైన చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను పరిరక్షిస్తున్నామని తెలిపారు. అలాగే మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు పేరుతో మూసీ కంపు బాధితులకు విముక్తి కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే సదుద్దేశంతో.. ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మంజూరు చేశామన్నారు. ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల లోపు ఉన్న రైతుల పంట రుణాలను మాఫీ చేశామన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చి రైతులకు అధిక లాభాలు తెచ్చిపెట్టామని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. ఎక్కడ తమ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందోననే ఆందోళనలో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఇక ప్రజలకు, రైతులకు 24 గంటలు అందుబాటులో ఉంటూ నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులకు ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తామన్నారు. భవిష్యత్తులో విద్యుత్ ఉద్యోగుల ఏరకమైన ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 'తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్' రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా, యాదాద్రి జిల్లా రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు యాదగిరి, అమర్‌నాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, అడిషనల్ సెక్రటరీ తిరుమల్, ట్రెజరర్ శ్రీనివాస్ రెడ్డి, భువనగిరి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మిరాజ్ షకీల్ బేగ్, రమేష్ రెడ్డి, అడిషనల్ సెక్రటరీ గుణగంటి బాబు గౌడ్, చౌటుప్పల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, సోమేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.




## సీఎం రేవంత్ ను కలిసిన ఎమ్మెల్యే వీరేశం



**నకిరేకల్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శు భాకాంక్షలు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు ఈ సందర్భంగా నకిరేకల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై,పలు సమస్యలపై ఎమ్మెల్యే వేముల వీరేశం సీఎం తో చర్చించగా, ఆయన సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు.!!

# కాంగ్రెస్ ను 'స్థానిక' ఎన్నికల్లో పాతర పెట్టండి: బూర

**భువనగిరి మాజీ ఎంపి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ పిలుపు**



నల్గొండ, రోమింగ్ న్యూస్: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండలో జరిగిన జిల్లా సంస్థాగత ఎన్నికల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టాలని కోరారు.

బీజేపీ పార్టీని ఆదరించాలని పిలుపునిచ్చారు. నల్గొండ మున్సిపాలిటీ తో పాటు నల్గొండ జిల్లాలోని 6 (ఆరు)నియోజకవర్గ స్థానిక ఎన్నికల్లో బిజెపి పార్టీని గెలిపించి బలపరిస్తే కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు , పీఎం ఆవాస్ యోజన ద్వారా ఇండ్లు అర్హులకు ఇప్పిస్తామని చెప్పారు. విశ్వకర్మ యోజన ద్వారా 4 లక్షల అప్లికేషన్లు వస్తే దానికి ఇంచార్జీ హోదాలో ఇప్పటికే లక్ష మందికి ఒక్కొక్కరికి 15,000 టూల్ కిట్లు ఇచ్చామన్నారు. అదే కాకుండా ఐదు శాతం వడ్డీ మోడీ గవర్నమెంట్ భరిస్తున్నదన్నారు. విశ్వకర్మ యోజన ద్వారా లక్ష రూపాయలు రుణాలు కూడా ఎలాంటి పూచికత్తి లేకుండా ఇవ్వడం జరిగిందన్నారు. కేవలం మోడీ ఎలాంటి తారతమ్య భేదాలు లేకుండా పార్టీలకతీతంగా కేవలం పేదలు... వృత్తి అని రెండే ప్రమాణంగా తీసుకొని ఇస్తున్నామన్నారు. ఎక్కడైనా ఒక్క రూపాయి అవినీతి జరగకుండా లక్షా మందికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఇప్పించడం జరిగిందన్నారు. ఇదే మోడీ మరియు బిజెపి సంస్కృతని అభివర్ణించారు.

తెలంగాణ మరియు నల్గొండ జిల్లా ప్రజలు మాత్రం ఈసారి మైండ్ లో ఫిక్స్ అవ్వండి... ఎన్నిక ఏదైనా కమలం గుర్తుకు ఓటేయాలని మీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

# అంధులకు అండగా ఉంటాం ..

**జనగామ డి ఆర్ డి ఓ ఎన్. వసంత డి ఆర్ డి ఓ**

**కలెక్టరేట్ లో ఘనంగా**

**లూయిస్ బ్రెయిలీ జన్మదినోత్సవం**



జనగామ జనవరి 4 (రోమింగ్ న్యూస్) : రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని జనగామ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని ఎం వసంత అన్నారు. అంధుల మార్గనిర్దేశకుడు లూయిస్ బ్రెయిలీ అని

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి ఎన్. వసంత అన్నారు. జనగామ జిల్లాలో దివ్యంగులు కోరిన విధంగా ఆసుపత్రులలో త్వరితగతిన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని, శాఖ పరంగా సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ వేగవంతం చేస్తామని, ఉపకరణాలు, వాహనాలు, ల్యాప్ టాప్ లు అందేలా చూస్తామని, రుణాల మంజూరుకు కృషి చేస్తామన్నారు. శనివారం జనగామ కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాల్ లో లూయిస్ బ్రెయిలీ 216 జన్మ దినోత్సవ వేడుకలను జిల్లా మహిళా శిశు సంక్షేమం, దివ్యంగుల సంక్షేమం, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు అంధుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సరం

సందర్భంగా దివ్యంగులతో అధికారులు కేక్ ను కట్ చేయించి దివ్యంగులు, అంధులకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అంధులకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన బ్రెయిలీ లిపి క్యాలండర్ ను ఆవిష్కరించారు.

అనంతరం డిఆర్డీఓ మాట్లాడుతూ... దివ్యంగుల అంధులకు ప్రత్యేక లిపి ని కనిపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మార్గనిర్దేశకుడు లూయిస్ బ్రెయిలీ అని అన్నారు. లూయిస్ బ్రెయిలీ ని ఆదర్శంగా తీసుకొని ప్రతిభావంతులుగా ఎదగాలని, విద్యలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ శిశు సంక్షేమం, దివ్యంగుల సంక్షేమం, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిణి ఫ్లోరెన్స్, ఉ ప వైద్యాధికారి రవీందర్ గౌడ్, జిల్లా బాలిక విద్యా విభాగం అధికారి గౌసియా బేగం, ఎన్.జి.ఓ. సాధిక్ అలీ, అంధదివ్యంగులు, తదితరులు పాల్గొన్నారు.

